
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 2 మే 2025



ఎల్‌ఆర్‌ఎస్‌కు మరో అవకాశం



- గడువు ముగిసినా కానరాని స్పందన
- మరో మూడు రోజుల పాటు పొడిగింపు
- రాయితీ సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు
- జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో నామమాత్రంగానే..

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తుదారుల ప్రయో జనం కోసం ఏప్రిల్ నెలాఖరు వరకు వన్ టైం సెటిల్‌మెంట్ చేసిన వారికి 25 శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. వివిధ కారణాలతో ప్రజలు ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకో లేకపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ మూడు రోజుల పాటు గడువు పొడిగించింది. ఈ నెల 3వ తేదీలోపు ఎల్‌ఆర్‌ఎస్ ఫీజు చెల్లించిన వారికి వన్ టైం సెటిల్‌మెంట్ కింద 25 శాతం రాయితీ ప్రకటించింది. ఎఫ్‌టీఎల్, నిషేధించిన సర్వే నంబర్లు మినహా ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ రెగ్యులరైజేషన్ ఫీజు నిర్ణయించారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న దరఖాస్తుదారులు మే 3వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే రిబేటు వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది.

విస్తృతంగా ప్రచారం చేసినా..

25శాతం రాయితీపై అవగాహన కల్పించేందుకు అధికారులు గత నెల 1వ తేదీ నుంచి విస్తృతంగా ప్రచారం జరిపారు. మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ మేళాలు నిర్వహించారు. ప్లాట్లు, వెంచర్ల యజమానులతో సమావేశమై రాయితీ గురించి వివరించారు. వార్డు ఆఫీసర్లతో ఫోన్లు చేయించారు. దరఖాస్తుదారుల ఫోన్ నంబర్లకు మెసేజ్‌లు పంపారు. హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేశారు. అయినా ఆశించిన స్థాయిలో స్పందన రాలేదు. కాగా రాయితీ గడువు గత నెల 30వ తేదీతో ముగియడంతో దరఖాస్తుదారుల అభ్యర్థన మేరకు మరో మూడు రోజులు పొడగిస్తూ సర్కారు నిర్ణయం తీసుకుంది.

ఆదాయం అనుమానమే

గతంలో రాష్ట్ర ప్రభుత్వం 2020 ఆగస్టు 28వ తేదీ వరకు ఎల్‌ఆర్‌ఎస్ కొరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశమిచ్చింది. కానీ అప్పట్లో ప్రక్రియ ముందుకు సాగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆగస్టు 1వ తేదీ నుంచి మళ్లీ ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను కొనసాగిస్తోంది. అయితే గతంలో మాదిరిగా కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలన జరుపుతున్నారు. ప్రధానంగా దరఖాస్తుదారుడు కొనుగోలు చేసిన స్థలం పట్టా, ప్రభుత్వ భూమా లేదా..ఏదేని చెరువు, కుంట ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉందా.. అనే అంశాలతో పాటు ఆ ప్లాట్‌కు సంబంధిచంఇన లింక్ డాక్యు మెంట్‌లను మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు క్షుణంగా పరిశీలన జరిపారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కాగా ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియ ప్రారంభించి నాలుగేళ్ల కావడంతో ఇప్పటికే సగం మంది ఓపెన్ ప్లాట్లను ఇతరులకు విక్రయించినట్లుగా భావిస్తున్నారు. మరికొందరు ఇళ్ల నిర్మాణాలు కూడా చేపట్టారు. జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల,మెట్‌పల్లి, రాయికల్, ధర్మపురి మున్సిపాలిటీల్లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న పలు ఓపెన్ ప్లాట్లలో ఇళ్లు దర్శనమిస్తున్నాయని సంబంధిత వర్గాలు అంటున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ఆదాయం రావడం అనుమానమేనని అంటున్నారు.

ఏప్రిల్ నెలాఖరు వరకు ఎల్‌ఆర్‌ఎస్ పరిస్థితి

మున్సిపాలిటీ	దరఖాస్తులు	ఆమోదించినవి	ఫీజు చెల్లించినవి	క్రమబద్ధీక రించినవి	ఆదాయం రూ. కోట్లలో
కోరుట్ల	9191	6827	896	119	3.14
జగిత్యాల	8790	7543	1569	315	5.48
రాయికల్	1903	1648	211	178	0.56
మెట్‌పల్లి	6587	5539	916	266	2.65
ధర్మపురి	1013	964	120	66	0.44
మొత్తం	27,484	22,520	3712	944	12.27

సీఎంను కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్



సీఎంను కలిసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్, ఆది శ్రీనివాస్

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని గురువారం జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కలిశారు. హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా కుల గణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ప్రక్రియలో భాగంగా అసెంబ్లీలో ఆమోదం తెలిపి దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టడానికి దిక్సూచిగా సీఎం రేవంత్ రెడ్డి మారారంటూ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ కిరణ్ కుమార్, నాయకులు వీరబత్తిని అనిల్, షబ్బీర్ అలీ తదితరులున్నారు.

కొనుగోళ్ల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- అడిషనల్ కలెక్టర్ బి. ఎస్ లత



తిప్పన్నపేట ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అడిషనల్ కలెక్టర్ లత

జగిత్యాలరూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ధాన్యం అమ్మిన రైతుల వివరాలు వెనువెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ లత అధికారులను ఆదేశించారు. గురువారం జగిత్యాల మండలం తిప్పన్నపేట, రూరల్ మండలం హైదర్‌పల్లి ఐకేపీ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి సెంటర్‌లలోని కొనుగోళ్ల వివరాలు, రవాణా, తూకంతీరు, ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు లేకుండా సెంటర్ నిర్వాహకులు కొనుగోళ్లు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ మండల తహసీల్దార్ రాంమోహన్, అర్బన్ నాయబ్ తహసీల్దార్ తిరుపతి, కార్తీకరెడ్డి, డీటీ వరప్రసాద్, సీసీ విద్యాసాగర్, కమిటీసభ్యులు, సిబ్బంది, రైతులు, పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందించిన ఎంఈవో

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ఫలితాలలో ప్రతిభ చూపిన విద్యార్థులను రాయికల్ ఎంఈవో శ్రీపతి రాఘవులు గురువారం అభినందించారు. రాయికల్ పట్టణంలోని వివేకవర్ధిని విద్యాలయంలో చదివి 576 మార్కులు సాధించిన గాజెంగి హరిణశ్రీ, 565 మార్కులు సాధించిన జన్నారపు వర్షలను ఎంఈవో అభినందించారు. సాధారణ, మధ్య తరగతి కుటుంబంలో జన్మించి, శ్రద్ధగా చదివి అత్యధిక మార్కులు సాధించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కైరం సత్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పల్లెపల్లెకూ ఆర్టీసీ బస్సు సౌకర్యం

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



పెగడపల్లి మండలంలో బస్సు ప్రారంబిస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

పెగడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : పల్లె పల్లెకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రభుత్వ విప్ , ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. జగిత్యాల నుండి గొల్లపల్లి మీదుగా నంచర్ల, దీకొండ, పెగడపల్లి నూతన బస్సు సర్వీసును గురువారం ఆర్టీసీ జగిత్యాల డిపో మేనేజర్ కల్పనతో కలసి విప్ లక్ష్మణ్ కుమార్ రాములపల్లి స్టేజి వద్ద ప్రారంబించారు. ఈ సందర్భంగా రాములపల్లి స్టేజి నుండి దీకొండ వరకు పార్టీ నాయకులు, అధికారులు, గ్రామస్థులతో కలసి స్వయంగా రూ. 1120 లు చెల్లించి టికెట్లు కొనుగోలు చేసి లక్ష్మణ్ కుమార్ ప్రయాణించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత పాలకులు దీకొండ , నంచర్ల గ్రామాల ప్రజల ప్రయాణ బాదలు పట్టించుకోకపోవడం, ఆయా గ్రామాల ప్రజలు సమస్యను తన దృష్టికి తీసుకురాగా వెంటనే ఆర్టీసీ అధికారులతో మాట్లాడి నూతన బస్సు సర్వీస్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ బస్ మోడల్ స్కూల్‌కు వెళ్లే విద్యార్థులతో పాటు జిల్లా కేంద్రానికి వెళ్లి ఉన్నత విద్య చదువుకునే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండల ప్రజలు బస్ సర్వీసును వినియోగించుకోవాలని ఈ సందర్భంగా లక్ష్మణ్ కుమార్ కోరారు. కార్యక్రమంలో జగిత్యాల డిపో మేనేజర్ కల్పన, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, విండో చైర్మన్ బాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను అభినందించిన ఎస్పీ

జగిత్యాల అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా కేంద్రం లోని పోలీస్ మెడ్ క్వార్టర్‌లో జరిగిన క్రైమ్ మీటింగ్‌లో ఎస్పీ అశోక్‌కుమార్ పలువురు పోలీసు అధికారులను అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు. జగిత్యాల పట్టణంలో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో అతి తక్కువ సమయంలో దొంగలను పట్టుకుని అట్టి ప్రాపర్టీని రికవరి చేసినందుకు జగిత్యాల పట్టణ ఇన్స్‌పెక్టర్ వేణుగోపాల్‌ను, ఎస్సై కిరణ్‌కుమార్‌ను, జీవన్‌లను అభినందించారు. దీంతో పాటు మల్యాల ఎస్సై నరేష్‌ను ఉత్తమస్టేషన్ అధికారిగా అభినందించి ప్రశంసా పత్రం అందించారు. వీరితో పాటు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో నేరస్తులను సకాలంలో పట్టుకున్న పోలీస్ అధికారులను, ట్రాఫిక్ పోలీసులను ఎస్పీ అభినందంచారు.

పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జగిత్యాల విద్యుత్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ సాలియా నాయక్ విద్యుత్ భద్రత వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యుత్‌వినియోగదారుడు విద్యుత్ ప్రమాదాల భారిన పడకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. జిల్లాను ప్రమాదరహిత జిల్లాగా చూడడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.

సీఎంఆర్ అప్పగించకుంటే చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య ప్రసాద్,



హాజరైన మిల్లర్లు, అధికారులు



కొండ్రికర్ల కొనుగోలు కేంద్రం వద్ద పరిశీలిస్తున్న కలెక్టర్

- కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్లు సకాలంలో సీఎంఆర్ బియ్యం అప్పగించకుంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని ఆడిటోరియంలో 2024-25 వానాకాలం సీజన్‌కు చెందిన సీఎంఆర్ చెల్లింపులపై రా రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో సీఎంఆర్ చెల్లింపుల్లో పురోగతి లేదని అన్నారు. రైస్ మిల్లర్స్ యాజమాన్యం సీఎంఆర్ త్వరితగతిన అప్పగించాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది రోజువారీ లక్ష్యం మేరకు మిల్లుల నుంచి సీఎంఆర్ డెలివరీలు చేయించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత, పౌరసరఫరా శాఖ అధికారులు, సివిల్ సప్లయి కార్పోరేషన్ అధికారులు, రా రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన మిల్లులకు తరలించాలి

మల్లాపూర్: వరి కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని 24 గంటల్లోపు కేటాయించిన మిల్లులకు తరలించాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. గురువారం మండలంలోని రాఘవపేట గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ వీర్‌సింగ్, అధికారులు, నిర్వహకులు, రైతులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి మండలంలో..

మెట్‌పల్లి రూరల్: నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ త్వరిగతంగా కొనుగోళ్లను చేపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం మండలంలోని కొండ్రికర్ల, వేంపేట గ్రామాల్లోని మెట్‌పల్లి, మెట్లచిట్టాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం కుప్పలు, రికార్డులు, ట్రక్‌సీట్‌లను పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం శుభ్రం చేయడానికి తప్పని సరిగా కేంద్రాల్లో ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తేమ శాతం పరిశీలించిన తరువాత రిజిస్టర్‌లోని సిరయల్ ప్రకారం తూకం వేయాలన్నారు. ఎంలాటి తేడా రాకుండా కొనుగోలు చేసి కేటాయించిన రైస్‌మిల్లులకు 24 గంటలలోపు తరలించాలన్నారు. ధాన్యం తరలింపు అంశంలో రవాణా సమస్యలు రాకుండా అవసరమైన లారీలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున హమాలీలతో ఉదయం, సాయంత్రం వేళాలలో పనులు చేయించాలని, మంచి నీటి సదుపాయం, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ రాజుమహద్, ఆర్‌ఐ ఉమేష్, సీఈవోలు ప్రవీణ్, తిరుపతి, అధికారులు, నిర్వహకులు, సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను వినియోగించుకోవాలి

- జిల్లా విద్యాధికారి రాము

జగిత్యాల అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వేసివి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని జిల్లా విద్యాధికారి రాము అన్నారు. గురువారం పట్టణంలోని పురాణిపేట పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలలోపు పిల్లలు ఈ వేసవి శిక్షణ శిబిరాలను వినియోగించుకోవాలని అన్నారు. ఇందులో వేదిక్ గణితంతో పాటు, సంగీతం, ఆటలు, ఇంగ్లీష్, తదితర కార్యక్రమాలు ఉంటాయని, ఇక్కడికి వచ్చే విద్యార్థులకు స్నాక్స్ ఉచితంగా అందజేస్తారని ఆయన అన్నారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణంలోని పురాణిపేట జిల్లాపరిషత్ పాఠశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమ్మర్‌క్యాంపును గురువారం జగిత్యాల విద్యాధికారి రాము ప్రారంభించారు. ఈసందర్భంగా డీఈఓ మాట్లాడుతూ సమ్మర్‌క్యాంపును ప్రభుత్వపాఠశాలలో చదువుచున్న విద్యార్థులే కాకుండా ప్రైవేట్ పాఠశాలలో చదువుచున్న విద్యార్థులు సైతం సద్వినియోగంచేసుకోవాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జగిత్యాల మండల విద్యాధికారి చంద్రకళ, డీసీఈబీ సెక్రటరీ చారి, డీఎస్‌ఓ రాజశేఖర్, ఎస్.ఓలు రాజేష్, మహేష్, మ్యాథ్స్‌ఫోరం అధ్యక్షుడు వడ్లకొండ శ్రీకాంత్, పీడి విశ్వప్రసాద్, హరికిషన్, పాతశ్రీను, గుండాశ్రీను, రాధ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి రాము

బీర్‌పూర్: బీర్‌పూర్ మండల కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ పాఠశాలలో గురువారం మండల విద్యాధికారి నాగభూషణం సమ్మర్‌క్యాంప్‌ను ప్రారంభించారు. జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు మండలకేంద్రంలో సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు ఎంఈవో తెలిపారు. మే నెల 1వ తేది నుండి మే 15వ తేది వరకు ఈ సమ్మర్ క్యాంప్ క్లాసులు నిర్వహించడం జరుగుతుందని, 15 రోజుల పాటుగా జరిగే సమ్మర్ క్యాంప్‌లో మండల పరిదిలోని ఆరువ తరగతి నుండి 10వ విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. సమ్మర్ క్యాంప్‌లో కోకో, వాలీబాల్, యోగ, ఫైన్ ఆర్ట్స్ మరియు అథ్లెటిక్స్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఉదయం 7గంటల నుండి 10 గంటల వరకు ఈ తరగతులు నిర్వహిస్తారని వీరికి ఉదయం అల్పాహారం కూడా అందించడం జరుగుతుందని వివరించారు. సమాచారం కోసం శిక్షణ ఇచ్చే బి. రాకేష్ పీఈటీ(9177581372), బి. అంజయ్య పీడీ(9963382220)లను సంపదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీర్‌పూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహమూర్తి, పీడీలు లక్ష్మణ్, మంజుల ధరణి, ఉపాధ్యాయులు రఘుపతి, గంగారం, సిఆర్పి సురేష్ క్రీడాకారులు పాల్గొన్నారు.

పెగడపల్లి: వేసవి శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ బి.రవీందర్‌లు పేర్కొన్నారు. యంగ్ ఇండియా సమ్మర్ క్యాంప్ కార్యక్రమాన్ని గురువారం పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌లు మండల విద్యాదికారి సులోచనా దేవితో కలసి ప్రారంబించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు అందజేశారు. 6 నుండి 9వ తరగతి విద్యార్థులకు యోగా, కరాటే, డ్రాయింగ్, ఇండోర్, అవుట్ డోర్ గేమ్స్ యందు శిక్షణ ఇవ్వనున్నట్లు, శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు తాగు నీరు, చక్కటి వసతి, స్నాక్స్ అందజేయన్నుట్లు మండల విద్యాధికారి సులోచన దేవి తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యావనరుల కేంద్రం సిబ్బందిపాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి సమ్మర్ క్యాంప్ ప్రారంభిస్తున్న ఎంఈవో

వెల్గటూర్: వేసవి క్రీడా శిక్షణను బాల బాలికలు వినియోగించుకోవాలని మాజీ సర్పంచ్ మేరుగు మురళిగౌడ్ కోరారు. గురువారం వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి క్రీడాశిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి క్రీడాశిక్షణలో భాగంగా నిర్వహించే వాలీబాల్ శిక్షణలో బాల బాలికలు మెళకువలలు నేర్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో కోచ్ కాంపెల్లి మహేష్ పాల్గొన్నారు.

కోరుట్ల: సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మండల విదాధికారి నరేశం కోరారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో సమ్మర్ క్యాంపు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మార్గం రాజేంద్రప్రసాద్, కాంప్లెక్ ప్రదానోపాధ్యాయులు శ్రీనివాస్, నల్ల భూమయ్య, సిఆర్‌పీలు దేవేందర్, గంగాధర్ పాల్గొన్నారు.

గోదాంకు నిప్పంటించిన గుర్తుతెలియని వ్యక్తులు

● టెంట్లు, డెకోరేషన్ సామగ్రి దగ్ధం

● రూ.10లక్షలు వరకు నష్టం



కాలిపోయిన సీలింగ్ టెంట్లు, డెకోరేషన్ సామగ్రి

ధర్మపురి, మే 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని పెద్దనక్కలపేటకు వెళ్లే దారిలో ఉన్న ఎండీ షబ్బీర్ గోదాంకు గుర్తుతెలియని వ్యక్తులు గురువారం తెల్లవారుజామున నిప్పంటించారు. దీంతో గోదాంలో నిల్వ ఉంచిన టెంట్ హౌస్‌కు చెందిన టెంట్లు, సీలింగ్స్, డెకోరేషన్ సామగ్రి పూర్తిగా కాలిపోయింది. రూ 10 లక్షలు పైగా భారీ నష్టం వాటిల్లింది, వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక రహమత్‌పురాకు చెందిన ఎండీ షబ్బీర్ పెద్దనక్కలపేట వెళ్లే దారిలో గోదాం గురించి ఒక గది కిరాయి తీసుకుని టెంట్ హౌస్‌కు సంబంధించిన టెంట్లు, సీలింగ్స్, డెకోరేషన్ సామాగ్రి కిరాయి ఇవ్వడం కోసం నిల్వ ఉంచారు. తెల్లవారుఝామున గోదాం ఎదురుగా కిరాణం షాపు నడుపుతున్న పోలవేని తిరుపతి సుమారు 3 గంటల సమయంలో నిద్ర లేచి చూసే సరికి టెంట్ హౌస్ గోదాం కాలిపోతుందని ఫోన్ చేసి షబ్బీర్‌కు తెలిపాడు. వెంటనే షబ్బీర్ అక్కడికి చేరుకుని ఫైర్ ఇంజన్‌కు ఫోన్ చేసి తెప్పించి మంటలను ఆర్పివేయించారు. గోదాంలో భద్రపరిచిన టెంట్లు, సీలింగ్ టెంట్లు (150), డెకోరేషన్, ప్లాస్టిక్ సామగ్రీ కాలి బూడిద అయ్యింది. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ సందర్శించి వివరాలు సేకరించారు. బాధితుడు ఎండీ షబ్బీర్ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.


అబ్దుల్ కలాం విగ్రహంపై పట్టింపేది?



గుర్తుపట్టరాని విధంగా ఉన్న అబ్దుల్ కలాం విగ్రహం

తిమ్మాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం విగ్రహం గుర్తుపట్టరాని విధంగా ధ్వంసమైంది. నిత్యం పాఠశాలలో విద్యార్థులకు విద్యాబుద్దులు నేర్పిస్తున్న ఉపాధ్యాయులు సైతం కలాం విగ్రహాన్ని పట్టించుకోకపోవడంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు కూడా పాఠశాల ఆవరణలోనే జరుగుతున్నా విగ్రహం వైపు కన్నెత్తిచూడక పోవడం శోచనీయం. పాఠశాల పరిసరాలు రాత్రయితే మందుబాబులకు అడ్డాగా మారుతాయి. దీంతో వారే విగ్రహం ధ్వంసం చేశారా.. లేదా ఇంకెవ రైనా చేశారా అనేది తెలియని పరిస్థితి. ఏది ఏమైనా స్థానిక ప్రజాప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, అధికారులు సైతం అబ్దుల్‌కలాం విగ్రహం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని అని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి అబ్దుల్ కలాం విగ్రహానికి మరమ్మతులు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

పని గంటలు లేని నేతన్నలు



ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు భరోసా..

సిరిసిల్లలో 30 వేల మరమగ్గాలు...

వస్త్ర పరిశ్రమలో 20 వేల మంది కార్మికులు, గార్మెంట్ రంగంలో 5 వేల మందికి ఉపాధి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

మరమగ్గాలే వాళ్లకు లోకం. నిత్యం నేత పనిలోనే జీవితం. కానీ 8 గంటలకు బదులు 12 గంటలు ఉపాధి కోసం మరమగ్గాల చప్పుళ్ల మధ్య నలిగిపోతున్నారు. కూలి ఒప్పందాల సమయంలో కార్మికులకు 8 గంటల పనివిధానం అమలు చేస్తామని యాజమాన్యాలు రాసుకున్న ఒప్పందాలు అమలులోకి రాకుండానే పోయాయి. పని గంటల పరిమితి కోసం సాగిన పోరాటంలో కార్మికుల రక్తంతో తడిసి ఎగిరిన ఎర్రజెండాతోనే సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ కార్మికులు ఉపాధికోసం గత ప్రభుత్వ హయాంలో బతుకమ్మ చీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లను సాధించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తరువాత ప్రభుత్వ ఆర్డర్లకు ఇబ్బందులు ఏర్పడిన సందర్భంలోనూ కార్మికులు మళ్లీ రోడ్డెక్కడంతో ప్రభుతం బతుకమ్మ చీరల స్థానంలో స్వశక్తి మహిళలకు చీరలు ఇతర ఆర్డర్లను ఇచ్చి భరోసాను నింపింది. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని కార్మికులు ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల మరమగ్గాలు, డైయింగ్‌లు, సైజింగ్‌లు, వార్పిన్‌లపై 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న నేతన్న పథకాల పై ఎంతో ఆశగా నేత కుటుంబాలు ఉన్నాయి. మరోవైపు పని గంటల పరిమితి లేకపోవడంతోనే మానసికంగా, ఆరోగ్య పరంగా ఇబ్బందులు పడుతున్నారు. కార్మిక సంఘాలు 8 గంటల పనివిధానం అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూనే ఉన్నాయి.

● నిత్యం బతుకు పోరాటం..

సిరిసిల్ల మగ్గం బతుకులు ఎప్పుడూ ఆగమాగమే. నిత్యం బతుకు పోరాటంగానే సాగుతుంది. పొద్దస్తమానం కష్టపడినా నేతన్నలు ఉపాధి కరువై అప్పుల్లో కూరుకుపోతూనే ఉన్నారు. పడుగు పోగులు, ఉరితాళ్లుగా వేలాడుతుంటే నిత్యం బతుకు చప్పుళ్ల



వినిపించిన మరమగ్గాలు ఎప్పుడూ నేతన్నలు వెక్కిరిస్తూనే ఉంటాయి. ఈక్రమంలో నేతన్నలకు ఉపాధి కల్పించే దిశగా ప్రభుత్వ ఆర్డర్లు భరోసా కల్పిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో అందిన ఆర్డర్లలో మార్పులు తీసుకవచ్చే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డర్లు ఇవ్వడంలో చేసిన జాప్యం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ఒక్కసారిగా సంక్షోభంలోకి వెళ్లింది. దాదాపు 15 మందికి పైగా కార్మికులు ఉరి పోసుకున్నారు. వామపక్ష పార్టీలు, పవర్‌లూం కార్మిక సంఘాలు, వస్త్రోత్పత్తి దారుల సంఘాల ఆందోళనల ఫలి తంగా ప్రభుత్వం మళ్లీ స్వశక్తి మహిళల కోసం చీరల ఆర్డర్లు, విద్యార్థులకు యూనిఫాం బట్ట ఉత్పత్తి వంటివి ఇవ్వడంతో ఉపశమనం పొందారు. విద్యుత్ రాయితీ పది హెచ్‌పీల నుంచి 25 హెచ్‌పీలకు పెంచారు. కొంత బకాయిల సమస్య వెంటాడుతుంది. స్వశక్తి చీరలకు రూ.50 కోట్లతో ఏర్పాటు చేసిన యారన్ డిపో ఆధారంగా నిలిచింది.

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ నేపథ్యంలో గత ప్రభుత్వ హయాంలో సిరిసిల్లలో బీడీలు చుట్టే కార్మికులు, వస్త్రోత్పత్తి రంగంలో ఉన్న మహిళలకు గార్మెంట్ రంగంలో ఉపాధి కల్పించడానికి పూనుకుంది. ఆ దిశగానే సిరిసిల్ల శివారులోని సర్దాపూర్- పెద్దూర్‌ల వద్ద మహిళల కోసం గార్మెంట్ రంగంలో పరిశ్రమలు తీసుకవచ్చే దిశగా అపెరల్ పార్కు, పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే వర్కర్ టు ఓనర్ పథకం కోసం వీవింగ్ పార్కు, నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అపెరల్ పార్కులో వస్తున్న యూనిట్లతో మహిళలకు ఉపాధి లభిస్తుండగా వర్కర్ టు ఓనర్ పథకం కోసం నేతన్నలు ఎదురుచూస్తూ నిరాశ చెందుతున్నారు. గత ప్రభుత్వం చేపట్టిన వర్కర్ టు ఓనర్ పథకంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోకపోవడం, నిర్మాణం పూర్తిచేసుకున్న షెడ్లలో ఇతర సంస్థలకు లీజుకు ఇవ్వడంతో పవర్‌లూం కార్మికుల్లో పథకంపై ఆశలు సన్నగిల్లాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం రూ.386.88 కోట్లతో పవర్‌లూం కార్మికులను యజమానులుగా మార్చే పథకాన్ని అమలుచేయడానికి సన్నాహాలు ప్రారంభించడంతో కార్మికుల్లో మళ్లీ ఆశలు చిగురించాయి. కానీ యాక్షన్ ప్లాన్ ఎంటో కనిపించకపోవడంతో ఎదురుచూపులే మిగిలిస్తున్నాయి.

గార్మెంట్ రంగంలో మహిళా కార్మికులకు ఉపాధి..

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభం నేపథ్యంలో సిరిసిల్ల పెద్దూర్ శివారులో మహిళా కార్మికుల కోసం 60 ఎకరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తూ రూ.174 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్లాట్లను కేటాయించారు. అపెరల్ పార్కులో గార్మెంట్ రంగంలో మహిళలకు ఉపాధి లభిస్తుంది. అపెరల్ పార్కులో 2021 ఏప్రిల్‌లో గోకుల్‌దాస్ ఇమేజ్ గార్మెంట్ సంస్థ యూనిట్‌ను ప్రారంభించింది. 800 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తూ ప్రారం భించిన యూనిట్‌ను 1600 మందికి ఉపాధి కల్పించే దిశగా విస్తరించింది. సిరిసిల్ల నుంచి నేరుగా అమెరికా లాంటి దేశాలకు రేడిమేడ్ వస్త్రాలు ఎగుమతి చేస్తుంది. ఇదేదిశగా బెంగు ళూరుకు చెందిన అంత ర్జాతీయ గార్మెంట్ రంగసంస్థ టెక్స్‌పోర్టు కంపెనీ యూనిట్‌ను ప్రారంభించింది. ఈ కంపెనీ ద్వారా 2వేల మందికి ఉపాధి లభించనుంది.



● 'వర్కర్ టు ఓనర్'కు రూపకల్పన

మరమగ్గాల కార్మికులను యజమానులుగా మార్చే దిశగా వర్కర్ టు ఓనర్ పథకాన్ని రూపకల్పన చేశారు. ఇందుకు అనుగుణంగా జిల్లా కేంద్రం శివారులోని పెద్దూరు వద్ద వీవింగ్ పార్కు నిర్మాణం చేపట్టారు. 42 వీవింగ్ షెడ్ల నిర్మాణం జరిగింది. ఇందులో కార్మికులకు మొదటి విడతలో 4416 మరమగ్గాలను గ్రూప్ షెడ్ల కింద అందించనున్నారు. ఒక్కో కార్మికుడికి 800 చదరపు అడుగుల్లో స్టోర్ రూంతో కలిపి అందిస్తారు. ఇందులో నాలుగు సెమీ ఆటోమేటిక్ మరమగ్గాలు, కండెలు చుట్టే యంత్రం, ఇస్తారు. పార్కులో 60 వార్పిన్ మిషన్లు కూడా ఏర్పాటు చేస్తారు. ఒక్కో యూనిట్ ధర రూ.8 లక్షలుగా ముందుగా నిర్ణయించారు.

ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా రూ.16.52 లక్షల వరకు చేరుకునే అవకాశం ఉంది. ఇందులో 10 శాతం లబ్దిదారుడి వాటాధనం, 50 శాతం ప్రభుత్వ రాయితీ, 40 శాతం బ్యాంక్ రుణం ఉండే విధంగా పథకానికి రూపకల్పన చేశారు. సిరిసిల్లలో ఎక్కడా లేని విధంగా ఏర్పాటు చేస్తున్న వీవింగ్ పార్కులో కొందరికే మరమగ్గాల యూనిట్లు దక్కే అవకాశం ఉండడంతో మిగతా కార్మికులు నిరాశకు గురయ్యే అవకాశం ఉంది. సిరిసిల్ల వస్త్రోత్పత్తి రంగంలో జియోట్యాగింగ్ చేసిన మరమగ్గాలు 30,352 ఉన్నాయి. వీటిపై 6,500 మంది పని చేస్తున్నారు. అనుబంధ పరిశ్రమల్లో మరో 6 వేల మంది వరకు పనిచేస్తున్నారు. ప్రభుత్వం మొదటి దశలో కేవలం 1,104 మందికే యూనిట్లను అందించడంతో మిగతా కార్మికులు నిరీక్షించే పరిస్థితి ఉంది.

జ్వరంతో మహిళ మృతి



కనకలక్ష్మి(ఫైల్)

ఓదెల, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన నాగపూరి కనకలక్ష్మీ(70) అనేమహిళ గురువారం జ్వరంతో మృతి చెందింది. మృతురాలి కుమారుడు వెంకటేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతవారం ఇంటివద్దనే కనకలక్ష్మికి మెదడు వాపుతోపాటు తీవ్రమైన జ్వరం రావడంతో అస్వస్థతకుగురైంది. వెంటనే కరీంనగర్‌లోని ఓప్రైవేట్‌ఆస్పత్రికి ఆసుపత్రికి తరలించారు. అక్కడివైద్యుల సూచన మేరకు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగాగురువారం మృతిచెందింది.

ఉప్పుమడుగు సహకార సంఘం కార్యదర్శిపై వేటు

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రాయికల్ మండలం ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకారసంఘం కార్యదర్శి తిరుపతిని సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు సంఘ పాలకవర్గానికి ఆయన ఆదేశాలు జారీచేశారు. ఉప్పుమడుగు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీససౌకర్యాలు కల్పించకపోవడంతోపాటు ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి హమాలీలను ఏర్పాటు చేయకపోవడంతో వీరాపూర్ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వీరాపూర్ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్, రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం, డీటీ గణేష్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సాయి కుమార్‌లు గురువారం సందర్శించి ధాన్యం కొనుగోళ్లు చేపడుతామని తెలిపారు.

షాపులోకి దూసుకెళ్లిన కారు..

● ధ్వంసమైన సామగ్రి

వేములవాడ టౌన్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గ్రామంలో రోడ్డుపక్కన షాపులోకి కారు దూసుకువెళ్లింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లి గ్రామంలోని కరీంనగర్-వేములవాడ ప్రధాన రహదారి పక్కన ఉన్న షాపులోకి కారు వేగంగా వచ్చి దూసుకెళ్లింది. దీంతో షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. షాపులోని సామగ్రి ధ్వంసమయ్యాయి. కారుడ్రైవర్‌కు స్వల్పగాయాలైనట్లు గ్రామస్థులు తెలిపారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

ఎలిగేడు, మే 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బోనగిరి సంపత్(29) అనే యువకుడు మద్యానికి బానిసై ఉరి వేసుకొని మృతిచెందినట్లు జూలపల్లి ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మద్యానికి బానిసై రోజూ మద్యం సేవిస్తుండగా భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. తాగుడు మానుకోకుంటే ఉండనని అతడిభార్య పుట్టింటికివెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన సంపత్ మద్యంతాగి బుధవారంరాత్రి ఇంటి దాబాపై పడుకుంటానని చెప్పివెళ్లాడు. గురువారం తెల్లవారుజామున మృతుడితల్లి వెళ్లి చూసేసరికి డాబామీద బట్టలు ఆరవేసుకునే తీగకు ఉరివేసుకొని కనిపించాడు. మృతుడి తల్లి లక్ష్మిఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వడదెబ్బతో హమాలీ మృతి

మంథని, మే 1 (ఆంధ్రజ్యోతి): మంథని మున్సిపాలిటీపరిధిలోని గంగాపురి గ్రామంలో వడదెబ్బతో పులి మణి(55) అనేహమాలీ గురువారం మృతిచెందాడు. ఉదయం గంగాపురిలోని ధాన్యం కొనుగోలు కేంద్రానికి హమాలీ పనికి వెళ్లి ఎండలో పనిచేయడంతో ఇంటికి వచ్చిన తర్వాత అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు అతన్ని చికిత్సకోసం మంథనిలోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి గోదావరిఖని ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య, కుమా రుడు, కూతురు ఉన్నారు.

కుల బహిష్కరణ: కేసు నమోదు

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకోడ్ గ్రామంలో ఓ వ్యక్తి ఫిర్యాదు మేరకు కుల బహిష్కరణ కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన వల్లపు గుట్టయ్యకు చెందిన భూమి పంచాయతీ విషయంలో కుల సంఘం చెప్పినట్లుగా గుట్టయ్య వినడం లేదని దీంతో అతన్ని బూతులు తిడుతూ కుల బహిష్కరణ చేశారన్న ఫిర్యాదు మేరకు సంఘం సభ్యుల మీద కేసు నమోదు చిసినట్లు ఎస్సై తెలిపారు.

సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ భాగస్వాములు కావాలి

● సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్



సిరిసిల్లలో సీఐటీయూ బహిరంగ సభలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రమేష్

సిరిసిల్ల రూరల్, మే 1 (అంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈనెల20న చేపట్టే సార్వత్రికసమ్మెలో కార్మికులందరు భాగస్వాములు కావాలని, మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కుల కోసం పోరాడుదామని సీఐటీయూ రాష్ట్రకార్యదర్శి కూరపాటి రమేష్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సీఐటీయూ జిలా కమిటీ ఆధ్వర్యంలో గురువారం ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని లేబర్‌అడ్డా, రైతుబజార్, మున్సిపల్ కార్యాలయం, జిల్లాఆసుపత్రి, నేహ్రూనగర్, చంద్రంపేట, గణేష్‌నగర్, బీవై నగర్ ఏరియాలల్లో సీఐటీయూ జెండాలను ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం బీవైనగర్‌లో చేపట్టిన బహిరంగ సభలో మేడే అమరవీరుల చిత్రపటాలకు ఘనంగా నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మేడే అమరవీరులు సాధించిన హక్కులను నేటి కేంద్ర బీజేపీ సర్కార్ హరించి వేస్తుందని ఆ హక్కుల రక్షణ కోసం మే20న జరుగు సార్వత్రికసమ్మెలో అన్నిరంగాల కార్మికులు, కష్టజీవులు భాగస్వాములుకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్మికులు ఉదయం 10గంటలకు పనికి వెళ్లి సాయంత్రం 6గంటలకు ఇంటికి వస్తున్నారంటే కారణం నాడు మేడే కార్మికులు చిందించిన రక్తం నేనని అన్నారు. అందులో అధికారంలో ఉన్న బీజేపీ కార్మికులు పోరాడి సాధించుకుంటున్న ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలకు పెంచుతూ కార్పొరేట్ దిగ్గజాలకు కార్మికుల కష్టార్జితాన్ని దోచిపెడుతున్నారని విమర్శించారు. 29 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ సర్కారు ఒక కలం పోటుతో రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకొచ్చిందని విమర్శించారు. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనం పీఎఫ్ ఈఎస్‌ఐ వంటి కనీస హక్కులు కూడా లేవన్నారు. బీజేపీపాలిత రాష్ట్రం ఉత్తర ప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ 8 గంటల పని విధానాన్ని 10 గంటలకు పెంచిందన్నారు. మే20న దేశవ్యాప్తంగా కార్మిక వర్గం చేస్తున్న సమ్మెతో మోదీ మెడలు వంచి కార్మికవర్గ ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి, కార్యదర్శి కోడం రమణ, మూషం రమేష్, అన్నల్‌దాస్ గణేష్, సూరం పద్మ, మిట్టపల్లి రాజమల్లు, రాపెల్లి రమేష్, నక్క దేవదాస్, సిరిమల్ల సత్యం, కుమ్మరికుంట కిషన్, గుండు రమేష్, కుడిక్యాల కనకయ్య , బెజుగం సురేష్, ఎక్కల్‌దేవి జగదీశ్, ఉడుత రవి, బాన శ్రీధర్, స్వర్గం శేఖర్, సుల్తాన్ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

రీల్స్ చేస్తూ నీటిలో మునిగి యువకుడి మృతి



మహ్మద్ అర్బాస్(ఫైల్)

కరీంనగర్ క్రైం, మే 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అశోక్‌నగర్‌కు చెందిన మహ్మద్ అర్బాస్(20) అనే యువకుడు రీల్స్ చేస్తుండగా ప్రమాదవశాత్తు వాగునీటిలో మునిగి గురువారం మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఇద్దరు స్నేహితులతో కలిసి అర్బాస్ నగర శివారులోని మానేరువాగు నీటిలోకి దిగి రీల్స్ వీడియో తీసుకుంటున్నారు. ఆ సమయంలో మరింత లోతుకు వెళ్లిన అర్బాస్ ప్రమాదవశాత్తుగా నీటిలోపడి మునిగిపోయాడు. స్థానికుల సహాయంతో అర్బాస్‌ను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మూడు రోజులుగా చెట్ల పొదల్లో వృద్ధురాలు

● గమనించి అధికారులకు సమాచారం ఇచ్చిన యువకులు ● సఖి కేంద్రానికి తరలింపు



వృద్ధురాలిని సఖి కేంద్రానికి తరలిస్తున్న డీడబ్ల్యూవో నరేష్, స్థానిక యువకులు

గొల్లపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం మల్లన్నపేట-శంకర్రావుపేట గ్రామరెవెన్యూ పరిధిలోని సాంబశివునిబోరులో దారుణం చోటుచేసుకుంది. హృదయవిదారకమైనస్థితిలో ఓ వృద్ధురాలిని చెట్ల పొదల్లో వదిలివెళ్లడంతో మూడురోజులుగా అచేతన స్థితిలో చావుబతుకుల మధ్య కొట్టాడుమిట్టాడింది. అటువైపువెళ్లిన యువకులు వృద్ధురాలి దీనస్థితిని గమనించి జిల్లా సంక్షేమశాఖ అధికారులకు సమాచారం అందించారు. జిల్లా సంక్షేమశాఖ అధికారి భోనగిరి నరేష్ హుటాహుటిన సంఘటనస్థలికి వచ్చి వృద్ధురాలిని సఖికేంద్రానికి తరలించిన ఘటన బుధవారం రాత్రి జరిగింది. స్థానికయువకులు, సంక్షేమశాఖ అధికారులు తెలిపిన వివరాల మేరకు.. జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురాకు చెందిన వేల్పుల బూదవ్వ అనే వృద్ధురాలు మూడురోజుల క్రితం గొల్లపల్లి మండలం శ్రీరా ములపల్లె గ్రామంలోని ఐకేపీకేంద్రం వద్ద రాత్రి పొద్దు పోయాక ఒంటరిగా నడవలేనిస్థితిలో ఓ చోట అచేతన స్థితిలో పడిఉంది. గమనించిన స్థానిక యువకుడు ఎనుగుల మహేష్ ఆమె వద్ద ఉన్న ఆధార్ కార్డులోని ఫోన్‌నంబర్‌కు ఫోన్‌చేసి సమాచారమందించాడు. వృద్ధురాలికి ఉన్న ఒక్కగానొక్క కూతురు ఫోన్‌ఎత్తి మాకేం సంబంధం లేదంటూ ఫోన్ కట్‌చేసింది. మూడురోజుల అనంతరం శంకర్రావుపేట-మల్లన్నపేట గ్రామాల రెవెన్యూ సరిహద్దులోని సాంబశివుని గుట్టకు ఉన్న చెట్లపొదల మధ్య దీనమైనస్థితిలో పడి ఉండడాన్ని కొందరు అటుగా వెళ్లిన యువకులు గమనించి శ్రీరాములపల్లెకు చెందిన బీఆర్ఎస్ యువనాయకులు సల్లూరి శోభన్‌గౌడ్‌కు సమాచా రమందించారు. మరికొందరు యువకులు, స్థానికులతో కలిసి బుధవారం రాత్రి సాంబశివుని బోరుకు చెట్లపొదల్లో వృద్ధురాలి ఆచూకీ కోసం గాలించి ఎట్టకేలకు గుర్తించి జిల్లా సంక్షేమశాఖ అధికారికి సమాచారమందించారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేష్ తన సిబ్బందితో తరలివచ్చి వృద్ధురాలిని జగిత్యాల జిల్లా ప్రధానాసుపత్రిలో వైద్య చికిత్సలు చేయించిన అనంతరం సఖి కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వృద్ధురాలి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు.

పూర్తిగా నడవలేనిస్థితిలో ఉన్న వృద్ధురాలు శ్రీరాములపల్లె ఐకేపీ కేంద్రం నుంచి సుమారు 2కిలోమీటర్ల దూరంలోఉన్న సాంబశివుని బోరుకు ఎలా వెళ్లిందన్నది ప్రశ్నార్థకంగా మారింది. వృద్ధురాలి కూతురు తన భర్త, పిల్లలతో కలిసి గుట్టబోరుకు వదిలివెళ్లిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. డీడబ్ల్యూవో భోనగిరి నరేష్, ఎఫ్‌ఆర్‌వో మతులాపురం కొండయ్య, డీసీపీవో హరీష్, జెండర్ స్పెషలిస్ట్ బోయపోతు గౌతమి, సఖి కేంద్రం సిబ్బంది రజిత, స్థానికులు సల్లూరి శోభన్ గౌడ్, శ్రీకోటి రఘుపతి, గడ్డం మహేష్, తదితరులు పాల్గొన్నారు.

ఉన్న భూమి లాక్కుని వృద్ధురాలి గెంటివేత

వేల్పుల బూదమ్మకు ఇస్లాంపురాలో సొంత ఇల్లుతో పాటు ఎకరం వ్యవసాయ భూమి ఉండగా జగిత్యాల రూరల్ మండలం నర్సింగాపూర్‌లో ఉంటున్న కూతురు ఇటీవలే భూమని తన పేరిట బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాకుండా 15 రోజుల అనంతరం వృద్ధురాలిని చితకబాది ఇంటిలో నుంచి గెంటివేయడంతో వృద్ధురాలు మతిస్థిమితం కోల్పోయి బయటికి వెళ్లినట్లు అధికారులు గుర్తించారు. శ్రీరాములపల్లె యువకుడు వృద్ధురాలి ఆచూకీ తెలపడంతో రాత్రిపూట వచ్చి గుట్టబోరుకు వదిలివెళ్లినట్లు అధికారులు, స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎనిమిదో రోజుకు స్వర్ణకారుల రిలేదీక్షలు

● మద్దతు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



ముస్తాబాద్‌లో స్వర్ణకారుల రిలేదీక్షకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ముస్తాబాద్, మే 1 (ఆంధ్రజ్యోతి) : ముస్తాబాద్ మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ ఎదుట కొనసాగుతున్న స్వర్ణకారుల రిలే దీక్షలు గురువారం ఎనిమిదో రోజుకు చేరాయి. దీక్షలకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి ఆధ్వర్యంలో నాయకులు సంఘీబావం తెలిపారు. కుల వృత్తులను కాపాడుకోవాలని, చేతివృత్తుల మీద జరుగుతున్న దాడికి నిరసనగా రిలే దీక్షలు జరగుతున్నాయన్నారు. స్థానికంగా నూతనంగా ఏర్పాటు చేస్తున్న జ్యువెలరీ షాప్‌ను పెట్టవద్దని షాప్‌ను పెట్టడం ద్వారా స్వర్ణకారుల ఉపాధి దెబ్బతింటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారులు చింతోజు బాలయ్య, రాజు, ఈశ్వరయ్య, రవి, సత్యం, రఘు, వెంకటేశ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజ్జెల రాజు గుండెల్లి శ్రీనివాస్, దీటి నర్సింలు, ఉచ్చిడి బాల్‌రెడ్డి, రంజాని నరేశ్, మిరుదొడ్డి భాను తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యం, ఒంటరితనం భరించలేక ఆత్మహత్య

వీణవంక, మే 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం, ఒంటరితనం భరించలేక వీణవంక మండలం బొంతుపల్లి గ్రామానికి చెందిన కేంశెట్టి మహేష్(57) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మహేష్ కొంతకాలంగా ఒంటరిగా ఉంటూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు సునీల్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి విగ్రహ శోభాయాత్ర



ముత్యంపేటలో పెద్దమ్మతల్లి శోభాయాత్రను నిర్వహిస్తున్న గ్రామస్థులు

మల్లాపూర్, మే, 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముత్యంపేట గ్రామంలోని పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. గురువారం జాతరలో భాగంగా పెద్దమ్మతల్లి విగ్రహాన్ని శోభ యాత్రగా ఆలయానికి ఘనంగా తీసుకొచ్చారు. ఈ సందర్భంగా భక్తి శ్రద్ధలతో భక్తులు అమ్మ వారిని డప్పు చప్పుల్ల మధ్య శోభ యాత్రగా ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు తదితరులు పాల్గొన్నారు. జాతర వేడుకలు ఈనెల 4వ తేదీ వరకు ఘనంగా కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

భూమి ఆక్రమించారని రైతు ఆత్మహత్య

జగిత్యాలరూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం పోరండ్ల గ్రామానికి చెందిన పడిగెల మల్లారెడ్డి(45) అనేరైతు భూమిని కొంత మంది వ్యక్తులు ఆక్రమించారని మన స్థాపానికి గురై పురుగులమందు తాగి గురువారం ఉదయం ఆత్మహత్యకు పాల్పడ్డట్లు జగిత్యాలరూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం పోరండ్ల గ్రామానికి చెందిన మల్లారెడ్డిని అతడి భార్య అనూషను అదే గ్రామానికి చెందిన పడిగెల గంగారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాజిరెడ్డి, రాజవ్వ, రమ అనే వ్యక్తులు గత కొంతకాలంగా ఇష్టం వచ్చినట్లు తిట్టడమే కాకుండా, పోరండ్ల గ్రామంలోని పోచమ్మ ఆలయం వద్ద గల భూమిని మల్లారెడ్డి ఈనెల 27వ తారీఖున చదునుచేయుటకు వెళ్లగా ఆరుగురు వ్యక్తులు మల్లారెడ్డిని భూమివద్దకు వస్తే చంపేస్తామని బెదిరించారు. దీంతో అప్పటినుంచి మనస్థాపానికి గురైన మల్లారెడ్డి గురువారం ఉదయం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకోగా గమనించిన బంధువులు చికిత్స నిమిత్తం కరీంనగర్ లోని ప్రతిమ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సాయంత్రం మల్లారెడ్డి మృతిచెందాడు. మృతుడి భార్య అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

మామిడి మార్కెట్‌లో ఫీజు ఎగవేత



జగిత్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ

- ప్రతి యేటా రూ. కోట్లలో వ్యాపారం
- మార్కెట్ ఆదాయం మాత్రం రూ. అరకోటి లోపే
- జగిత్యాల మామిడి మార్కెట్‌లో వ్యాపారుల గోల్‌మాల్
- కట్టడి చేస్తేనే మార్కెట్‌కు ఆదాయం

జగిత్యాల, మే 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మామిడి మార్కెట్‌లో వ్యాపారుల మాయాజాలం కొనసాగుతోంది. వ్యాపారుల గోల్‌మాల్ వల్ల మామిడి సీజన్‌లో మార్కెట్ దాదాపుగా రూ. కోటిన్నరకు పైగా నష్టపోతుందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. ప్రతి యేటా రూ. వంద కోట్ల నుంచి రెండు వందల కోట్లకు పైగా వ్యాపారం జరుగుతుందన్న అంచనాలున్నాయి. కొన్ని సంవత్సరాలుగా మార్కెట్ కమిటీకి దాదాపుగా రూ. అరకోటి ఆదాయం మాత్రమే లభిస్తోంది. నిబంధనల ప్రకారం వ్యాపారులు నిర్వహించిన కొనుగోళ్లలో మార్కెట్ కమిటీకి ఒక్క శాతం ఫీజు రూపేనా చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్‌లో రూ. కోట్లలో వ్యాపారం నిర్వహిస్తున్నప్పటికీ మార్కెట్ ఫీజు మాత్రం అంతంతమాత్రంగానే చెల్లిస్తున్నారు. దీంతో మార్కెట్‌కు తగిన ఆదాయం రావడం లేదు. గత 17 సంవత్సరాల క్రితం ఏర్పాటయిన జగిత్యాల వ్యవసాయ మార్కెట్‌కు యేటా రూ. 50 నుంచి రూ. 60 లక్షల లోపు మాత్రమే ఆదాయం వస్తోంది.



విక్రయానికి వచ్చిన మామిడి కాయలు

జగిత్యాలలో మామిడి మార్కెట్ పరిస్థితి ఇలా

జగిత్యాల శివారులోని చల్‌గల్ మామిడి మార్కెట్‌ను 2005 సంవత్సరంలో సుమారు 23 ఎకరాల్లో ఏర్పాటు చేశారు. గత యేడాది రూ. 10 కోట్లు వెచ్చించి యార్డులో మామిడి మార్కెట్‌కు అవసరమైన షెడ్డులను నిర్మించారు. మామిడి కాయల కొనుగోలుకు యార్డు పరిధిలో 88 మంది కమీషన్ ఏజంట్లు, 59 మంది అడ్తి వ్యాపారులు న్నారు. దీనికి తోడు ఎటువంటి లైసెన్సులు లేకుండా సుమారు పాతిక మంది వరకు వ్యాపారం నిర్వహి స్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రతి యేటా జగి త్యాల మామిడి మార్కెట్‌కు సుమారు 5 వేల మంది కార్మికులు ఇతర రాష్ట్రాల నుంచి వస్తుంటారన్నారు. వ్యాపారులు ప్రతి సీజన్‌లో సుమారు రూ. 100 కోట్ల నుంచి రూ. 200 కోట్లకు పైగా టర్నోవర్ చేస్తుంటారు.

ఇతర రాష్ట్రాలకు మామిడి తరలింపు

జగిత్యాల నుంచి మామిడి కాయలను ఢిల్లీ, జమ్మూ, కశ్మీర్, చండీఘడ్, హర్యానా, పంజాబ్, నాగ్‌పూర్ వంటి రాష్ట్రాలకు లారీల్లో తరలిస్తుంటారు.

అంతంతమాత్రంగానే ఆదాయం

జగిత్యాల మామిడి మార్కెట్‌లో గత యేడాది రూ. 63.29 లక్షల ఫీజు మాత్రమే వసూలైంది. 2022-23 సీజన్‌లో రూ. 43.28 లక్షలు ఫీజు వసూలైంది. అదే విధంగా 2021-22 సంవత్సరంలో రూ. 60.90 లక్షలు, 2020-21 సంవత్సరంలో 91.70 లక్షలు, 2019-20 సంవత్సరంలో రూ. 69.65 లక్షలు, 2018-19 సంవత్సరంలో రూ. 64.01 లక్షలు, 2019-18 సంవత్సరంలో 71.89 లక్షలు మార్కెట్ ఫీజు వసూలు అయినట్లు రికార్డులు తెలుపుతున్నాయి. మార్కెట్ లైసెన్స్ తీసుకోవడానికి, నిర్ణీత ఫీజు చెల్లించడానికి వ్యాపారులు పెద్దగా ఆసక్తిచూపడం లేదు.

నోటీసులు జారీ చేసినా రాని ఫలితం

మార్కెట్ యార్డులకు రైతులు తీసుకొని వచ్చిన పంట ఉత్పత్తులను వ్యాపారులు కొనుగోలు చేస్తారు. వ్యాపారులు చేపట్టే లావాదేవీల ఆధారంగా మార్కెట్ యార్డుకు సెస్ చెల్లిస్తారు. మార్కెట్ ఫీజు చెల్లింపు ప్రధాన ఆదాయ వనరుగా ఉంటోంది. గత యేడాది యార్డులో ప్రారంభించిన షెడ్లలోనే మామిడి కాయల కొనుగోళ్ల జరపాలని, యార్డు వెలుపల క్రయ విక్రయాలు జరిగితే చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నప్పటికీ కొందరు వ్యాపారులు పట్టించుకోకుండా యార్డు వెలుపలనే కొనుగోళ్ల ప్రారంభించారు. అధికారులు నోటీసులు జారీ చేసినా ఫలితం రావడం లేదు. మార్కెట్ ఫీజు ఎగవేయడానికే వ్యాపారులు ఎత్తులు వేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకొని ఆదాయానికి గండి పడకుండా చూడాల్సిన అవసరముందని రైతులు కోరుతున్నారు.

ప్రతి నిత్యం 20 నుంచి 30 లారీల్లో మామిడికాయలు వివిధ ప్రాంతాలకు తరలిపోతుంటాయి. పెద్ద లారీల్లో సుమారు 12 నుంచి 15 టన్నుల మామిడి కాయలను తరలిస్తుంటారు. గత నాలుగు, ఐదేళ్లగా సగటున టన్నుకు రూ. 30 వేల వరకు మామిడి ధర పలికింది. టన్నుకు రూ. 30 వేల చొప్పున 15 టన్నులకు రూ. 4.50 లక్షలు అవుతోంది.

వ్యాపారులు మార్కెట్‌కు ఒక్క శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఒక్కో లారీకి రూ. 4,500 ఫీజు చెల్లిం చాలి. ప్రతి రోజు 30 లారీల్లో మామిడి కాయలు తరలితే సుమారు రూ. 1.62 లక్షలు ఫీజు రూపేనా మార్కెట్‌కు ఆదాయం రావాల్సి ఉంది. దాదాపుగా నాలుగు నెలల పాటు మామిడి మార్కెట్ కొనసాగుతోంది. ఈ లెక్కన రూ. కోటిన్నరకు పైగా మార్కెట్‌కు మామిడి వ్యాపార ఆదాయం చేకూరాలన్న అంచనా ఉంది. దీనికి తోడు మామిడి కాయ ధరలు పెరిగిన సందర్భాల్లో దాని ప్రకారం ఫీజు అధికారులు వసూలు చేయాలి. కాగా వ్యాపారులు అధిక రేటుకు మామిడి కాయలు కొనుగోలు చేసినప్పటికీ తక్కువ రేటుకు కొనుగోలు చేశామని గోల్‌మాల్ చేస్తూ ఆ మేరకు మాత్రమే అధికారులకు మార్కెట్ ఫీజు చెల్లిస్తున్నారు. అధికారులకు పరిస్థితి తెలిసిన ప్పటికీ చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఫలితంగా మార్కెట్ ఆదాయం కోల్పోవలసి వస్తోంది.

చర్యలు తీసుకుంటాం

ప్రకాశ్, జిల్లా మార్కెటింగ్ అధికారి, జగిత్యాల



జగిత్యాలలోని మామిడి మార్కెట్‌లో వ్యాపారులు మార్కెట్ ఫీజు చెల్లించేలా పకడ్బందీ చర్యలు తీసు కుం టాం. మార్కెట్ ఆదాయానికి గండి కొట్టే వ్యాపా రులను గుర్తిస్తాం. ఎప్పటికప్పుడు క్రయవిక్రయాల పై పర్యవేక్షణ చేస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటాం.

ఇటలీ వధువు.. వేములవాడ వరుడు..

- సంప్రదాయ పద్ధతిలో ఘనంగా వివాహం



నూతన జంటను ఆశీర్వదిస్తున్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, మే 1 (ఆంధ్రజ్యోతి): ఇటలీ దేశానికి చెందిన యువతి.. వేములవాడకు చెందిన యువకుడు హిందూ సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. రాజన్నసిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణానికి చెందిన ఓలిమినేని నిత్యానందరావు-వీణారాణి దంపతుల కుమారుడు శ్రీకర్‌రావు ఫ్రాన్స్ దేశంలో ఉన్నతవిద్య అభ్యసించాడు. ఆ క్రమంలో ఇటలీకి చెందిన వైద్యురాలు ఫెదిరికతో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. బుధవారం రాత్రి స్థానిక మహారాజ ఫంక్షన్‌హాల్‌లో హిందూ సంప్రదాయ పద్ధతిలో వేద మంత్రాల సాక్షిగా వారిద్దరూ ఒకటయ్యారు. వివాహానికి వధువు తరపున ఇటలీనుంచి సుమారు 25మంది బంధుమిత్రులు హాజరయ్యారు. నూతనవధూవరులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మాజీఎమ్మెల్యే రేగులపాటి పాపారావు తదితరులు ఆశీర్వదించారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని రైతుల ఆందోళన



రైతులతో మాట్లాడుతున్న ఎస్సై

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు ప్రారంభమై నెల రోజులైనా ధాన్యం కొనుగోళ్ల ప్రారంభించడం లేదని జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని వీరాపూర్ గ్రామానికి చెందిన రైతులు గురువారం జగిత్యాల-రాయికల్ ప్రధాన రహదారిపై ఉప్పుమడుగు స్టేజీ వద్ద బైఠాయించి ఆందోళన చేపట్టారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కోసి ధాన్యాన్ని కుప్పలు పోసి చాలా రోజులవుతున్నా అధికారులు కొనుగోళ్ల ప్రారంభించలేదని మండిపడ్డారు. అకాల వర్షాలు పడి ధాన్యం తడిస్తే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోయారు. వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘటనా స్థలానికి జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్, తహసీల్దార్ ఖయ్యూం, ఎస్సై సుధీర్ రావులు చేరుకుని రైతులతో మాట్లాడి కొనుగోళ్ల ప్రారంభిస్తామని చెప్పి ఆందోళనను విరమింపజేశారు.

శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలి

- ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చిరుతల రామాయణం కళాకారులు

వెల్గటూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ శ్రీరాముడిని ఆదర్శంగా తీసుకోవాలని ధర్మపురి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. బుధవారం రాత్రి ముత్తునూరు గ్రామంలో ప్రదర్శించిన ఆధ్యాత్మిక కార్యక్రమం చిరుతల రామాయణం పట్టాభిషేకంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రేక్షకుల మధ్యన నాయకులతో కలిసి కూర్చుని చిరుతల రామాయణం లోని పాత్రలు, సన్నివేశాలను ఆసక్తిగా తిలకించారు. అనంతరం అడ్లూరి మాట్లాడుతూ రామాయణం గొప్పదనాన్ని, శ్రీరాముడి గొప్పదనాన్ని చిరుతల రామాయణం రూపంలో గ్రామీణ ప్రాంతం వారికి అర్థమయ్యే రూపంలో కళాకారుల ప్రదర్శించడం గొప్ప విషయం అన్నారు. కళాకారులకు పది వేల రూపాయాల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోల్ల తిరుపతి, అనుమాల మంజుల, సందీప్‌రెడ్డి, ఎలుక రాజు, శ్రీకాంత్‌రావు, తిరుమలేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదే

- ఎమ్మెల్సీ సురభి వాణిదేవి



దుద్దెనపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి

సైదాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): దేశాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతదేనని ఎమ్మెల్సీ సురభివాణిదేవి అన్నారు. గురువారం సైదాపూర్ మండలంలోని వెన్నంపల్లి, సోమారం, లక్ష్మన్నపల్లి, ఆరెపల్లి, ఎక్లాస్‌పూర్, దుద్దెనపల్లి గ్రామాల్లో డ్రగ్స్ నిర్మూలన పోరుయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశస్వాతంత్రం కోసం భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లాంటి వారిని నేటియువత ఆదర్శంగా తీసుకొని స్వంతంగా ఎదుగుతూ దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. యువత మత్తుకు, మద్యానికి, ఇతర చెడు వ్యసనాలకు బానిసలై అర్థాంతరంగా చనిపోతున్నారన్నారు. రానున్న రోజుల్లో దేశంలో యువత యొక్క సంఖ్య గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు. మనపిల్లలను చెడు వ్యసనాలకు అలవాటు కాకుండా డ్రగ్స్ లాంటి మత్తు మహమ్మారిని మన గ్రామాల్లోకి రాకుండా పోరాటంచేసి యువతను కాపాడాలని మహిళ లోకాన్ని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కుమార స్వామి, హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ చైర్మన్ కవ్వ లక్ష్మారెడ్డి, జేఏసీ కో-ఆర్డినేటర్ డ్యాగల సారయ్య, ఎదులాపురం తిరుపతి, చెప్యాల ప్రకాష్, మాట్ల వెంకటస్వామి, గాండ్ల పద్మ, జగదీష్, కుమారస్వామి, ఆశీర్వాదం, ప్రభాకర్, ప్రవీణ్, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, కుమారస్వామి, రాజిరెడ్డి, రాజయ్య, యుగంధర్, రవీందర్, రాజేందర్, రజిత, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

వేములవాడ కల్చరల్, మే 1 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. మే డే సందర్భంగా సెలవురోజు కావడంతో రాజన్న ఆలయానికి భక్తులు తరలి వచ్చి రాజన్నకు కోడెమొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

ఆలూరులో ఘనంగా పోచమ్మ బోనాలు

రాయికల్, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూరు గ్రామంలో గురువారం పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఇంటికో బోనంతో ఊరేగింపుగా తరలివెళ్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం వద్ద నైవేద్యాలు సమర్పించారు. అలాగే దావత్ పూజారులు మేకను గావుపట్టారు. పిల్లాపాపా, గొడ్డూ గోదాను చల్లంగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు, యువకులు తదిత రులు పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న పూజారులు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

జాతీయ కవి సమ్మేళనానికి దేవానందం



దేవానందం

సిరిసిల్ల, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా చైతన్య సమితి ఆధ్వర్యంలో ఈనెల8న హైదరాబాద్, త్యాగరాయ గాన సభలో జరిగే జాతీయ కవిసమ్మేళనంలో సిరిసిల్లకు చెందిన ప్రముఖకవి బూర దేవనాందంకు కవితాగానం చేయడానికి ఆహ్వానించారు. తెలుగు భాషకు పట్టాభిషేకం పేరుతో నిర్వహించే భాష సదస్సు, కవిసమ్మేళనంలో కవి తను వినిపించనున్న దేవానందంను సిరిసిల్ల జిల్లా రచయితల సంఘం, జిల్లా మానేరు రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, కవులు, రచయితలు అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మే 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లన్నపల్లి గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. కోర్కల్ గ్రామంలోని మానేరు వాగునుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న టాక్రట్ డ్రైవర్,ఓనర్ రావణవేణి సదయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు.

ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలి



వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేస్తున్న యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి

గణేశ్‌నగర్, మే1 (ఆంధ్రజ్యోతి): ఐకార్ నుంచి అనుమతులు లేకుండా కేవలం రాష్ట్ర ప్రభుత్వ అనుమతి ఉందనే పేరుతో నిర్వహిస్తున్న ప్రైవేటు యూనివర్సిటీలపై చర్యలు తీసుకోవాలని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి కోరారు. గురువారం వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం తిరుపతి మాట్లాడుతూ యూనివర్సిటీల్లో అగ్రికల్చర్ కోర్సులను ఉన్నాయని చెబుతూ విద్యార్థులను, తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తూ అడ్మిషన్లు చేపడుతున్న కావేరీ యూనివర్సిటీ ఇతర ప్రైవేట్ యూనివర్సిటీల గుర్తింపు రద్దు చేయాలని, తక్షణమే కేసులు నమోదు చేయాలని అన్నారు. అనుమతులు తీసుకోకుండా విద్యార్థులను యూనివర్సిటీలో చేర్చుకోవడంతో చదువుల పూర్తయిన తర్వాత వచ్చే సర్టిఫికెట్‌తో ఎలాంటి ఉపయోగముండదన్నారు. భవిష్యత్‌లో ఉద్యోగాలకు అనర్హులుగా ఉంటారని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేపట్టాలన్నారు. అనంతరం సానుకూలంగా స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వర్ మాట్లాడుతూ దీనిపై తక్షణమే ఉన్నతాధికారులతో మాట్లాడి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. నాయకులు సుమన్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా మేడే వేడుకలు



జగిత్యాలలో ఏఐటీయూసీ కార్యాలయం ఎదుట జెండా ఎగురవేస్తున్న నాయకులు



పెగడపల్లిలో మేడే వేడుకలు



కోరట్ల సి. ప్రభాకర్ భవనంలో మేడే వేడుకలు

జగిత్యాల అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వేడుకలలో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి జీవన్‌రెడ్డి పారిశుధ్య కార్మికులను శాలువాలతో సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ స్పందన, మాజీ కౌన్సిలర్‌లు కండ్లపెల్లి దుర్గయ్య, పుప్పాల అశోక్, గుగ్గిల్ల హరీష్ ఉన్నారు. సిఐటియు కేంద్ర కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు పుప్పాల శ్రీకాంత్, ఎ. రజిత, గుగ్గిల్ల స్వప్న, బొర్ర శేఖర్ పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఐటియుసి కార్యాలయంలో జరిగిన మేడే వేడుకలలో ఏఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ముక్రం జుండా ఎగురవేశారు. ఎల్ఐసి ఏజంట్స్ కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. విద్యుత్ శాఖ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండా

● జగిత్యాల : తెలంగాణ గ్రామ పంచా యతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ మండల శాఖ అధ్యక్షుడు జంగిలి ఎల్లయ్య ఆధ్వర్యంలో కార్మికులు సీఐటీయూ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అలాగే గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో, స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట కార్మికులు మే డే వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

● పెగడపల్లి: ఏఐటీయుసి ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు రాజారాంపల్లి నక్కపల్లి స్టేజి వద్ద ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగరాల భూమేశ్వర్ జండా ఆవిష్కరించారు.

● వెల్గటూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల శ్రమను దోచుకుంటున్నాయని సీపీఐ నాయకుడు దుడ్డెల మల్లేష్ దుయ్యబట్టారు. గురువారం వెల్గటూర్, పైడిపల్లి గ్రామాలలో మేడే ఘనంగా నిర్వహించారు. సీఐటీయుసీ జండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సందీప్‌రెడ్డి, ఉదయ్ గౌడ్, నరేష్ గౌడ్, నాగరాజు, నర్సయ్య, కార్మికులు, చంద్రయ్య, గంగాధరి తిరుపతి, సంగ ఐలయ్య, సురేష్, లక్ష్మణ్, మల్లేష్, మొగిలి, సత్తయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

● ధర్మపురి: ధర్మపురి మండలంలో మేడే వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తా వద్ద తెలంగాణ హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అధ్యక్షులు బత్తిని రాజయ్య, వాటర్ ట్యాంక్ వద్ద సీఐటీయు ఆధ్వర్యంలో మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సంఘం ధర్మపురి పట్టణ అధ్యక్షులు బడుగు లచ్చయ్య జెండాను ఎగురవేశారు. స్థానిక ఏఎంసీ కార్యాలయం వద్ద ఏఐటీయుసీ ఆధ్వర్యంలో అధ్యక్షులు దుగ్గిళ్ల తిరుపతి జెండా ఎగుర వేశారు.

● కొడిమ్యాల: లేబర్ కోడ్స్ రద్దుకు సమిష్టిగా పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా కో కన్వీనర్ కోమటి చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో గురువారం సీఐటీయు ఆధ్వర్యంలో ఆటో కార్మికులు, నాయకులు కార్మిక జెండాను ఆవిష్కరించారు. సింగపూర్‌లోని చైనీస్ గార్డెన్‌లో సుమారు 100 మంది కలిసి కేక్ కట్ చేసి సంబురాలను జరుపుకున్నారు.

● మల్యాల: మండలంలో మేడే వేడుకలను కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. మల్యాల అంగడిబజార్ వద్ద సీఐటీయూ, బ్లాక్ చౌరస్తా వద్ద ఏఐటీయూసీ, లంబాడిపల్లిలో శ్రామిక శక్తి తెలంగాణ వర్కర్స్ యూనియన్, మల్యాల సివిల్ సప్లై గదాం వద్ద హమాలీ సంఘం ఆధ్వర్యంలో మేడే జరిపి జెండాలను ఎగురవేశారు.

● కోరుట్ల రూరల్: ప్రపంచ కార్మిక దినోత్సవం మేడే వేడుకలను పట్టణం కార్మిక సంఘ నాయకులు ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని సి. ప్రభాకర్ భవనంలో సిపిఐ, కొత్త బస్టాండ్ ప్రాంతంలో సిపిఎం, తెలంగాణ ప్రగతి శీల బీడి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. శ్రీనివాస రోడ్డులో తెలంగాణ బీడి కమ్‌గార్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వేడుకలను జరిపారు. పట్టణంలో సబ్‌స్టేషన్ ఆధ్వర్యంలో విద్యుత్ యూనియన్, ఆర్‌టీసీ డిపోలో ఆర్‌టీసీ కార్మికులు, మున్సిపల్‌లో పారిశుధ్య కార్మికులు, హమాలీ సంఘ సభ్యులు వేడుకనలు నిర్వహించారు.

● కథలాపూర్: అంతర్జాతీయ మేడే ఉత్సవాలు మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఏళ్ల తరబడి బానిసలుగా శ్రమదోపిడికి గురైన కార్మికులు పోరాటం జరిపి తమ హక్కులు సాధించుకున్నారని జిల్లా ఏఐటీయుసీ కార్యదర్శి చెన్నవేని దశరథం చెప్పారు. ఎర్రజెంగా ఎగురవేసి పోరాట యోధులకు నివాళులర్పించారు.

● మెట్‌పల్లిటౌన్: మేడే స్ఫూర్తితో కార్మిక ఉద్యమాలకు సిద్ధం కావాలని ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి ఉస్మాన్ అన్నారు.గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో, సెంట్రింగ్ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సం మేడే సందర్భంగా అరుణ పతాకం ఎగరవేసి సంబరాలను జరుపుకున్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, హమాలీ సంఘం అధ్యక్షులు బర్ల లక్ష్మణ్, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఏశమేని గణేష్, సంఘ సభ్యులు, కార్మిక సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● మెట్‌పల్లి రూరల్ : ప్రపంచ కార్మిక దినోత్సవం 139వ మేడే సందర్భంగా మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో సీఐటీయు జెండాను కార్మిక సంఘం నాయకులు, మెట్‌పల్లి కార్మిక మహిళలతో ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో హమాలీ సంఘం అధ్యక్షుడు సోమిడి రాజయ్య, ప్రధాన కార్యదర్శి సంపత్, కోరే రాజుకుమార్, ఉస్మాన్, కార్మికులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

● మేడిపల్లి : మండలంలోని గ్రామాల్లో మే డే వేడుకలను కమ్యూనిష్టులు కార్మికులతో కలిసి జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో జెండాలను ఏగురవేశారు. పోరాట స్ఫూర్తిని కొనసాగిద్దాం అంటూ సమరశీల పోరాటాల వారోత్సవాలు నిర్వహించారు. కార్మిక, శ్రమిక ప్రజలను ఉద్దేశించి ఉపన్యసించారు. కార్యక్రమంలో కమ్యూనిష్టు నేతలు హన్మంతు, భూమయ్య, గంగరాజం,ముస్కెం జలంధర్ ఉన్నారు.



వెల్గటూర్‌లో సీఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న కార్మికులు



మెట్‌పల్లిలో జెండా ఎగురవేస్తున్న ఏఐటీయూసీ నాయకులు



ధర్మపురిలో జెండా ఎగురవేస్తున్న హమాలీ కార్మిక సంఘం నాయకులు

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం

కోరుట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : గర్బస్థ లింగ నిర్ధారణ చట్టపరమైన నేరమని మహిళా సాధికారత కేంద్ర జెండర్ స్పెషలిష్ట్ గౌతమి, స్వప్న ఐసిడిఎస్ సిడిపిఓ మణెమ్మలు అన్నారు. గురువారం పట్టణంలోని రామలయంలో జరిగిన కోరుట్ల అంగన్‌వాడీ టీచర్లు సెక్టార్ మీటింగ్‌లో వారు పాల్గొని శిశు సంక్షేమంపై అవగాహన కల్పించారు. బాలికల, బాలురలతో పాటు సమానంగా పోషణను తల్లిదండ్రులు అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కుల గణనకు ఆమోదంపై సంబరాలు

కథలాపూర్, మే 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం చేపట్టబోయే జనాభా గణనతో పాటు కుల గణనకు ఆమోదం తెలపడం పట్ల గురువారం కథలాపూర్‌లో బీజేపీ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. కుల గణనకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. దీంతో సామాజికంగా వెనకబడిన కులాలను గుర్తించడానికి వీలు కలిగి వారికి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందడానికి వీలు కలుగుతుందని పేర్కొన్నారు. బస్టాండ్ ప్రాంతంలో పలువురికి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు మల్యాల మారుతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మంగళి మహేశ్, అద్వాని, కాశోజి ప్రతాప్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడు నరెడ్ల రవి తదితరులు ఉన్నారు.

విద్యార్థులతో విజయోత్సవ ర్యాలీలు

కోరుట్ల రూరల్, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పది పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు గురువారం మండలంలోని పలు గ్రామాలలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయలు విజయోత్సవ ర్యాలీలను నిర్వహించారు. 95.2 శాతం ఉతీర్ణత సాధించగా మండలంలోని నాలుగు పాఠశాలలు వంద శాతం ఉతీర్ణత సాధించి ముందు వరసలో నిలించింది. మండలంలోని యూసుఫ్‌నగర్, అయిలాపూర్, నాగులపేట, ఎఖీన్‌పూర్ పాఠశాలలో విద్యార్థులు వంద శాతం ఉతీర్ణత పోందంగా గ్రామస్థుల ఆద్వర్యంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయలు ప్రతిభ కనపరిచిన విద్యార్థులచే విజయోత్సవ ర్యాలీలను నిర్వహించారు. రెండవ సారి యూసుఫ్‌నగర్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉతీర్ణత సాధించడం గమనర్హం.ఈ సందర్భంగా విద్యార్థులను సన్మానించి అభినందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

వెల్గటూర్, మే 1 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులు పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి శ్రీప్రియ కోరారు. గురువారం వెల్గటూర్ మండల కేంద్రంలో 68 గేదెలకు ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను వేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్గటూర్ గ్రామ సెక్రెటరీ. మామిడి శ్రీనివాస్, నాయకులు సందీప్ రెడ్డి. కస్తూరి తిరుమలేష్ .కల్లెడ నర్సయ్య, పశు వైద్య సిబ్బంది .నాగరాజు, నారాయణ, రామ్ కుమార్, చంద్రయ్య, అంజి పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ చిత్రపటానికి క్షీరాబిషేకం

పెగడపల్లి, మే 1 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం కులగణనపై తీసుకున్న నిర్ణయంపై హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పెగడపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల శాఖ ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ, రేవంత్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ల చిత్రపటాలకు క్షీరాబిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, ఒరుగల శ్రీనివాస్, సంధి మల్లారెడ్డి, కడారి తిరుపతి, ఆకుల విష్ణు, సత్తిరెడ్డి, అనీల్, రాజు, రవినాయక్, అంజయ్య, కొమురయ్య, బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీషర్టుల అందజేత

కొడిమ్యాల, మే 1(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో రెడ్‌స్టార్ ఫ్రెండ్స్ యూత్ క్రికెట్ జట్టుకు స్వర్గీయ గుజ్జేటి మహేష్(గ్రేహౌండ్స్ కానిస్టేబుల్)జ్ఞాపకార్థం అతని సోదరుడు లవకుమార్ టీషర్టులను అందించారు. యూత్ సభ్యులకు నాతె ప్రదీప్(రిటైర్డు ఆర్మీ) బ్యాట్స్ అందించారు. టీషర్టులను అందించిన దాతలకు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఆర్. స్పోర్ట్స్ సభ్యులు, యూత్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పామాయిల్ సాగుపై అవగాహన

మల్యాల, మే 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేటలో గురువారం వ్యవసాయ అధికారులు పామాయిల్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. సాగు ప్రయోజనాలతో పాటు లాభాల గురించి వివరించారు. తొలకరి వర్షాల ప్రారంభంలోని పామాయిల్ మొక్కలు నాటితే మేలు అని, ఎకరాన రెండు లక్షల వరకు ఆదాయం సమకూర్చుకోవచ్చునని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి కె.చంద్రదీపక్, ఏఈవోలు కారుణ్యకుమార్, లోహియా కంపెనీ ప్రతినిధి నిమ్మ అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

● పెగడపల్లి: కొనుగోలు కేంద్రాలలో తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని త్వరితగతిన తూకం వేసి మిల్లులకు తరలించాలని అడిషనల్ డీఆర్‌డీఓ చరణ్‌దాస్ పేర్కొన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం అడిషనల్ డీఆర్‌డీఓ చరణ్ దాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం నిల్వలు, తూకం వేసిన బస్తాలను , డాటా ఎంట్రీ రికార్డులను పరిశీలించారు. తేమశాతం వచ్చిన ధాన్యం వెంట వెంటనే కాంటా వేస్తూ మిల్లులకు తరలించి, డాటా ఎంట్రీ పూర్తి చేసి రైతులకు త్వరితగతిన డబ్బులు ఖాతాలలో జమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం మానిటరింగ్ జాడి మల్లేశం, ఏపీఎం సమత, సీసీలు తిరుపతి, శశికుమార్, విఓఏ కవిత, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద యువతికి ఆర్థికసాయం

కోరుట్ల, మే 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన ఓ నిరుపేద యువతి పెండ్లికి పలు కుల సంఘాలు సహకారం అందించంగా స్వర్ణకార సంఘ సభ్యులు సమక్షంలో కార్యక్రమాన్ని పూర్తి చేసి యువతికి అండగా నిలిచారు. పట్టణంలో ఆదర్శ నగర్‌లో నివాసం ఉంటున్న ఇందూరి వెంకటరమణ - విజయ్ లక్ష్మీ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉంది. కొన్ని రోజుల క్రితం కుమారుడు దురదృష్టవసాత్తూ ఆనారోగ్యంతో మృతి చెందగా ఆ దంపతులు ఆర్థికంగా చితికిపోయారు. కూతురు వివాహం మెట్‌పల్లి పట్టణానికి చెందిన యువకుడితో నిశ్చయమైంది. దీంతో వధూవరులకు స్వర్ణకార సంఘ సభ్యులు రూ. 12,000 నగదును అందించారు.

భూ భారతిపై పోలీస్ అధికారులకు అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మధుసూదన్

జగిత్యాల అర్బన్, 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన భూ భారతి - 2025 చట్టంపై గురువారం జగిత్యాల జిల్లా పోలీసులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు ఎస్పీ, డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్ భూ భారతిలోని ముఖ్యమైన అంశాలను, ప్రయోజనాలను వివరించారు.. ప్రభుత్వ భూముల రక్షణ, ప్రజల హక్కుల హామీ, భూవివాదాల పరిష్కారంలో పారదర్శకత పెంపు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

కండ్లపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థులను అభినందించిన కలెక్టర్

జగిత్యాలరూరల్, మే 1(ఆంధ్రజ్యోతి): పదోతరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించిన జగిత్యాల రూరల్ మండలంలోని కండ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులను కలెక్టర్ సత్యప్రసాద్, డీఈఓ రాములు గురువారం అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో చదివి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని విద్యార్థులకు సూచించారు. ఫలితాలు రావడానికి కృషిచేసిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈకార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపల్ నగేష్, ఉపాధ్యాయులు ప్రవీణ్, సతీష్, కిష్టయ్య, వెంకటేష్, సైదుల్లాఖాన్, ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

నీలగిరి పెద్దమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మెట్‌పల్లిటౌన్, మే 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇంద్రనగర్‌లో ఉన్న నీలగిరి పెద్దమ్మ తల్లిని గురువారం పలువురు రాజకీయ నాయకులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు, బీజేపీ రాష్ట్ర నాయకులు డా.రఘు, మెట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ వేర్వేరుగా అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు, ఇంద్రనగర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



నేరెళ్లలో ధాన్యం తేమశాతం పరిశీలిస్తున్న విప్ అడ్లూరి

ధర్మపురి, మే 1 (ఆంధ్రజ్యోతి): రైతులు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మపురి మండలంలోని నేరెళ్ల గ్రామంలో ధర్మపురి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన కొబ్బెరికాయ కొట్టి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ ఏ గ్రేడ్ వరి ధాన్యం మద్దతు ధర రూ. 2320, బీ గ్రేడ్ వరి ధాన్యం మద్దత్తు ధర రూ 2300 ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం ఏర్పాటు చేయాలని రైతులు తన దృష్టికి తీసుక వచ్చిన వెంటనే జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ధర్మపురి మండల వ్యవసాయాధికారి రాజ్‌కుమార్, ధర్మపురి పీఏసీఎస్ సీఈవో అయ్యోరు రాజేష్, వైస్‌చైర్మన్ షేర్ల రాజేశం, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు పాల్గొన్నారు.

దేశానికే తెలంగాణ రోల్‌మోడల్

జగిత్యాల అర్బన్, మే 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో కులగణన నిర్వహించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దేశానికే రోల్‌మోడల్ అయ్యాడని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి దేశవ్యాప్తంగా కుల గణనచేసేలా తెచ్చిన ఒత్తిడి మేరకు దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అమోదం తెలిపిన సందర్భంగా పట్టణంలో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీభిషేకం చేశారు.

●జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని గుట్రాజ్‌పల్లి జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో వదంశాతం ఉత్తీర్ణత సాధించారు. ఎం. అనుష్క 558, అంజలి 543, ఈ. మనోజ్‌కుమార్ 522, జె. శరణ్య511, ఎల్. రాంచరణ్ 501 , జె. ప్రశాంత్ 477, ఎస్. సునీత్ 473, కె. రోహన్ 443, ఎస్. నిచిత443, ఎ. శివకుమార్442 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు.

● ధర్మపురి: కాంగ్రెస్ పార్టీ గత 2023 ఎన్నికల మెనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ జరుగుతున్న రాష్ట్ర వ్యాప్త ఆటో రథయాత్ర గురువారం ధర్మపురి పట్టణానికి చేరుకుంది. ఏప్రిల్ 25న మెదక్ జిల్లా నర్సాపూర్ నుండి ప్రారంభమైన ఈ రథయాత్ర మే 27 వరకు హైదరాబాద్ చేరుకుంటుంది. అనంతరం ఇందిరాపార్క్ వద్ద ఆటో ఆకలి కేకలు మహాసభ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం ఆటో రథయాత్ర కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆటో యూనియన్ అధ్యక్షులు వీరవేని కొమురయ్య, గౌరవ అధ్యక్షులు గరిగె శంకర్ పాల్గొన్నారు.

● కొడిమ్యాల: మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్న పురాతన శ్రీ ఆంజనేయస్వామి ఆలయం మే 2న నిర్వహించు ఆలయ వార్షికోత్సవానికి ముస్తాబైనది. ఆంజనేయస్వామి ఆలయంలో వేడుకలను పురస్కరించుకొని శుక్రవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో మహా అన్నదానం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

● జగిత్యాల అర్బన్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీట్ బజార్‌లో ఉన్న శ్రీ కృష్ణవేణి టాలెంట్ పాఠశాలలో బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో అత్యధిక మార్కులు సంపాదించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యం గురువారం ఘనంగా సన్మానించారు.

క్రీడలతో ఎంతో ఉపయోగం : ఎమ్మెల్యే మేడిపల్లి



క్రీడలను ప్రారంభిస్తున్న మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, మే1(ఆంధ్రజ్యోతి) : యువత సన్మార్గంలో నడవటానికి క్రీడలు దోహదపడుతాయని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో గ్రామ మాజీ సర్పంచు పిడుగు ప్రభాకర్‌రెడ్డి కుమారుడు పిడుగు సాకెత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల ఆవరణలో చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం టీబీ ఐఈసీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు మాజీ సర్పంచు పిడుగు ప్రభాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్ తదితరులు జిల్లా ఉప వైద్యాధికారి ఎస్. శ్రీనివాస్, మండల వైద్యాధికారి పరమేశ్వరీ, సీహెచ్‌వో రాజశేఖర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మే 1 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మపురి మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ధర్మపురి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, ఏఎంసీ వైస్‌చైర్మన్ సంగ నర్సింహులు, డాక్టర్ ఒడ్నాల జగదీప్, డివిజనల్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం

మల్యాల, మే 1(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త కుల గణనకు ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల మల్యాలలో బీజేపీ నాయకులు ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న ఈ కులగణనతో సమ్మిళిత వృద్ధి వేగంగా పుంజుకుంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాజుల మల్లేశం, బొట్ల ప్రసాద్, బొడిగే సురేశ్, నులుగొండ సురేశ్, రాజశేఖర్, గుండేటి గంగారాం, రుత్త కిషన్, ఉప్పుల సంతోష్, సొన్నాకుల శ్రీనివాస్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు

● మేడిపల్లి: భారత ప్రధాని నరేంద్రమోదీ భారత దేశ చరిత్రలో మెట్టమెదటి సారి జన గణనతో పాటు కుల గణన కూడా పారదర్శకంగా నిర్వహించాని నిర్ణయానికి స్వాగతిస్తూ మండల బిజేపీ నాయకులు ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లడుతూ దేశ చరిత్రలో మెదటి సారిగా కుల గణన చేయడం పై సంతోషాన్ని వెలిబుచ్చారు. కార్యక్రమంలో మేడిపల్లి మండలశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కరడ్ల మధుకర్, దశరథరెడ్డి, జగన్ రెడ్డి, తిరుపతిరెడ్డి, ధర్మరెడ్డి, జలపతిరెడ్డి పాల్గొన్నారు.

● మెట్‌పల్లిటౌన్: దేశవ్యాప్తంగా బీసీ కుల గణన నిర్వహించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ తీసుకున్న చారిత్రత్మక నిర్ణయాన్ని స్వాగతిస్తూ పట్టణ బీజేపీ అధ్యక్షుడు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి బీజేపీ కార్యాలయంలో గురువారం ప్రధానమంత్రి కి కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన చిత్ర పటానికి పాలాభిషేకం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ రఘు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీల హక్కులను గుర్తించి చిత్తశుద్ధితో తీసుకున్న నిర్ణయం దేశవ్యాప్తంగా ప్రజల నుంచి అభినందనలు అందుకుంటోందని అన్ని వర్గాల పట్ల సమాన దృష్టికోణం కలిగిన నాయకుడు నరేంద్ర మోదీ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్,రాష్ట్ర స్టేట్ కౌన్సిల్ మెంబర్ ఏలేటి నరేందర్ రెడ్డి,పార్లమెంట్ కో కన్వీనర్ గుంటుక సదా శివం,జిల్లా నాయకులు చింతల శ్రీకర్ గౌడ్, నాయకులు సుంకే అశోక్ తదితరులు ఉన్నారు.

● సంక్షిప్తం..

● మల్యాల: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో యంగ్ ఇండియా సమ్మర్ క్యాంపులను మండలంలోని మల్యాల జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, తక్కళ్లపల్లి జడ్పీ పాఠశాలలో గురువారం మండల విద్యాధికారి ఎస్.జయసింహరావు ప్రారంభించారు. ఈ క్యాంపులలో 6 నుంచి పదవ తరగతి చదివే విద్యార్థులకు ఆటలు, డ్యాన్స్, యోగా, గణితం, సైన్స్ బేసిక్స్, ఇంగ్లీష్ గ్రామర్ ఉచితంగా నేర్పించబడుతయని ఈ సందర్భంగా ఎంఈవో తెలిపారు. కార్యక్రమంలో నాగభూషణం, అంజయ్య, గౌతమి, గంగసాగర్, మమత, రాకేశ్, బాగ్యలక్ష్మి, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : పట్టణంలోని పైడిమడుగు పద్మశాలి సంఘ అధ్యక్షుడుగా బాబులాల్ ఏకగ్రీవంగా ఎంపిక కాగా గురువారం సంఘ సభ్యులు నూతన కార్యవర్గంను ప్రమాణ స్వీకారం చేయించారు. ఉపాధ్యక్షుడుగా అంకం శ్రీధర్, కార్యదర్శి ఆడెపు భూమేశ్వర్, కోశాధికారి కటకం రాములతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంను సన్మానించి అభినందించి సన్మానించారు.

మల్యాల: జగిత్యాల జిల్లాలో ఉత్తమ ఎస్‌హెచ్ వోగా మల్యాల ఎస్సై ఏ.నరేశ్‌కుమార్ ఎంపిక అయ్యారు. గురువారం జరిగిన జిల్లా క్రైమ్ మీటింగ్‌లో భాగంగా ఎస్పీ అశోక్‌కుమార్ ఎస్సైకి ప్రశంసాపత్రం అందించి అభినందించారు. అలాగే మల్యాల సీఐ నీలం రవిని కూడా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సైని డిఎస్పీ రఘుచందర్, మల్యాల, కొడిమ్యాల, పెగడపల్లి పోలీస్‌స్టేషన్ సిబ్బంది తదితరులు అభినందించారు.

● జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి పద్మశాలిసేవాసంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొక్కుల గణేష్, ఉపాధ్యక్షుడిగా గాజుల శ్రీనివాస్, ప్రధానకార్యదర్శిగా మ్యాకల నారాయణ, కోశాధికారిగా బొమ్మకంటి గంగాధర్, కార్యవర్గసభ్యులుగా ఆడువాల శ్రీనివాస్, బొమ్మకంటిరాజన్న, కొక్కులరమేష్, బొమ్మకంటిహన్మాండ్లను ఎన్నుకున్నారు.

మల్యాల: మల్యాల క్రాస్ రోడ్డు వద్దగల ఆల్ఫోర్స్ విద్యార్థిని తూంగురి నిత్య పదవ తరగతి పరీక్ష ఫలితాలలో టాపర్‌గా నిలువగా గురువారం ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి అభినందించారు. నిత్య 583 మార్కులు సాధించి స్కూల్‌లో పాటు మండల టాపర్‌గా నిలిచింది.

● మెట్‌పల్లిటౌన్ : పట్టణంలోని ఇంద్రనగర్‌లో ఉన్న నీలగిరి పెద్దమ్మ తల్లిని గురువారం పలువురు రాజకీయ నాయకులు దర్శించుకున్నారు.